పన్ను కట్టు.. లేదంటే కుళాయి కట్!



- 200కు పైగా కుళాయి కనెక్షన్లు తొలగించిన కార్పొరేషన్ అధికారులు
- వేసవిలో ఇలా చేయడమేంటని బాధితుల మండిపాటు
- కూటమి ప్రభుత్వంలో 15 శాతం మేర పన్నులు పెంచేశారని ఆవేదన

నగరాభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లించడం తప్పనిసరి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే ఆ పన్నులు వసూలు చేసేందుకు కార్పొరేషన్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై నగర ప్రజలు మండిపడుతున్నారు. వేసవిలో నీరు అందకుండా ఇంటి కుళాయిలు తొలగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు కొత్త ప్రభుత్వం పన్నులు భారీగా పెంచేసి ఇప్పటికిప్పుడు కట్టాలంటూ హుకుం జారీ చేస్తే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీకాకుళం నగర పరిధిలో ఓ ఇంటికి కుళాయి పైపులైన్ కట్ చేస్తున్న సిబ్బంది



కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సౌకర్యాల పరిస్థితి గ్రామానికి ఎక్కువ.. మున్సిపాలిటీకి తక్కువ అనే విమర్శలు ఏ నోట విన్నా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఇంటి పన్నును కూటమి ప్రభుత్వం వచ్చాక ఏకంగా 15 శాతం పెంచేశారు. ఈ పన్నుల భారం నగరవాసుల నెత్తిన గుదిబండలా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు 'బాదుడే బాదుడు' అని కార్యక్రమం నిర్వహించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల నెత్తిన పన్నులు పెంచేసిందని, ధరలు దేశంలో ఎక్కడా లేనంతంగా పెరిగిపోయాయని ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. తీరా కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర వస్తువులు మొదలుకుని, ఇంటిపన్నులు, విద్యుత్ చార్జీలు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులను తొమ్మిది నెలల పాలనలో 10 రెట్లు పెంచేశారు.

కట్‌లు.. సీజ్‌లు..

కార్పొరేషన్ పరిధిలో రెండు, మూడు నెలలుగా పన్నులు చెల్లింపుపై ఒత్తిడి పెరుగుతోంది. పన్ను చెల్లించకపోతే విద్యుత్, కుళాయి కనెక్షన్లు తీసేస్తామని కార్పొరేషన్ అధికారులు నేరుగా సచివాలయ ఉద్యోగులతో హెచ్చరికలు చేయిస్తున్నారు. దీంతో ఎక్కడ ఉద్యోగం ఊడిపోతోందనని భయంతో సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. లేనిపక్షంలో కుళాయి కనెక్షన్లు తొలగిస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలో సుమారు 200కు పైగా మంచినీటి కుళాయిలు కట్‌చేసేవారు. మరికొంత మందికి షాపులు సీజ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 10కి పైగా ఇళ్లు, షాపులు సీజ్ చేసి తాళాలు వేసేశారు.

పన్నులు సరే.. సౌకర్యాల మాటేంటి?

నగరంతో పాటు ఏడు విలీన పంచాయతీల్లో సౌకర్యాలు సక్రమంగా లేనప్పటికి పన్నులు మాత్రం కట్టాలని, లేకుంటే ఏం చేస్తామో తమకే తెలియదని అధికారులు బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ ఇబ్బందులు పట్టించుకోకుండా ఇంత కఠినంగా వ్యవహరించడం కూటమి ప్రభుత్వానికి తగదని వాపోతున్నారు. వేసవిలో ప్రజలకు తాగునీరు వంటి అదనపు సౌకర్యాలు కల్పించాల్సింది పోయి కుళాయి కనెక్షన్లు తొలగించడం ఏంటని గగ్గోలు పెడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పన్నులు చెల్లింపునకు గడువు పెంచాలని కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాకే..



రెండేళ్లుగా బకాయి ఉన్న పన్నులు చెల్లించకుంటేనే కుళాయి కనెక్షన్ తీసేస్తున్నాం. పన్ను చెల్లించాలని వారం రోజులు గడువు ఇస్తున్నాం. ఆ తరువాత మూడు రోజులకు డిస్‌కనెక్షన్ నోటీస్ ఇచ్చి కుళాయి కనెక్షన్లు తీస్తున్నాం. పన్నులు చెల్లించాక తిరిగి రీ-కనెక్షన్ ఇస్తున్నాం. పన్నులు సత్వరమే కట్టి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించండి.

– పి.వి.వి.డి.ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం



పన్ను కట్టకపోవడంతో షాపును సీజ్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

సామాజిక తనిఖీలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.25.60 కోట్లతో జరిగిన ఉపాధి పనులకు ఈ నెల 14 నుంచి 27 వరకు సామాజిక తనిఖీలు జరగనున్నాయని ఎస్ఆర్‌పీ ఈ.పున్నపునాయుడు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీలకు గ్రామాల్లో 8 డీఆర్‌పీ బృందాలు సర్వే చేపడతాయని, ఉపాధి వేతనదారులు ప్రజాప్రతినిధులు సహకారాన్ని అందించి తగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరాజు, నాయకులు రొక్కం బాలకృష్ణ, ఏపీవో ఆర్.సత్యవతి, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొల్లమాంబకు నివాళులు



మొల్ల విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిషనర్



మొల్ల చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు

శ్రీకాకుళం కల్చరల్ బలగ కుమ్మరివీధిలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ వై.వి.శివకుమార్ హాజరై మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనురాధ, డీఎస్‌ఓ, సంఘ నాయకులు, పెద్దలు మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తెలుగుభాషలో రచించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో వీరస్వామి, ఎర్రన్న, స్వామి, మల్లేసు, సూర్యనారాయణ, గణపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

ఎచ్చెర్ల/జి.సిగడాం: లావేరు మండలంలో పంచాయతీ కార్యదర్శులపై పనిఒత్తిడి తగ్గించాలని కోరుతూ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ పి.వెంకటరాజు, ఈవోపీఆర్‌డీ వి.విశ్వేశ్వరరావులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కెల్ల రామకృష్ణ మాట్లాడుతూ సెలవు రోజుల్లోనూ సర్వే పేరిట అవిశ్రాంతంగా పనిచేస్తున్నందున శారీరక, మానసిక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జి.సిగడాం మండలంలో పంచాయతీ కార్యదర్శులపై వేధింపులు ఆపాలని గ్రామ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు తులసీప్రసాద్ సాహు, ఏర్నేన జ్యోతి శ్రీనివాస్ కోరారు.

కామదహన కరుణాకర లింగం!



శ్రీకాకుళం నగరంలోని గుడివీధిలో ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి కామదహనోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి గుడివీధి కూడలిలో అగ్నిజ్వాలను ఏర్పాటు చేసి వేడుకలు జరిపించారు. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం 8.30 డోలో మండపంలో రాధాకృష్ణులకు డోలోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సర్వేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

విద్యార్థుల చదువులపై ఆరా



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పలువురు అధ్యాపకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చదువులపై ఆరా తీస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ వెళ్లి విద్యా పురోగతిని తెలుసుకుంటున్నారు. సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో జి.సిగడాం మోడల్ స్కూల్ ఇంగ్లిషు అధ్యాపకులు డీహెచ్ సుబ్రహ్మణ్యం, తెలుగు అధ్యాపకులు తిరుపతిరావు, ఇతర మోడల్ స్కూళ్ల అధ్యాపకులు పాల్గొంటున్నారు.

కాలేయ వ్యాధులపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న కూన అనిల్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: కాలేయ వ్యాధులపై నిర్లక్ష్యం వహించవద్దని జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షుడు కూన అనిల్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద ఆర్.ప్రశాంత్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రాంగణంలో గురువారం జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో కాలేయ సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఫైబ్రో స్కానింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఐ వ్యవస్థాపకులు జామి భీమశంకర్, జోన్ కో-ఆర్డినేటర్ బి.వరలక్ష్మి, సెక్రటరీ టి.ఉషారాణి, ట్రెజరర్ బోడిగి మధు, సభ్యులు మండవల్లి రవి, లావణ్య, క్లినిక్ స్పెషలిస్ట్ బెజ్జం వినయ్ పాల్గొన్నారు.

వర్సిటీ లైబ్రరీలో డిజిటల్ సేవలు



డిజిటల్ సేవలను ప్రారంభిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీ ప్రధాన గ్రంథాలయంలో గురువారం నింబస్ సంస్థ సహకారంతో సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఒన్ నేషన్, ఒన్ సబ్‌స్క్రిప్షన్ పద్ధతిలో డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. దేశంలో 700కు పైగా విద్యా సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నింబస్ సంస్థ శిక్షకులు జయకృష్ణన్, రెక్టార్ అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు అనురాధ, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

రామకౌండిన్యకు సత్కారం



శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన శివశ్రీనృత్య కళానికేతన్ గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులు రామ కౌండిన్య ఇటీవల ఢిల్లీలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. సీసీఆర్‌టీ సంయుక్త నిర్వహణలో ఐక్యం–2025 నృత్యోత్సవాలలో భాగంగా ప్రదర్శన ఇవ్వడంతో కౌండిన్యను నిర్వాహకులు సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

కనకదుర్గకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలోని కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు నేతేటి రుషికుమార్ శర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వైభవంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో డోలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల పాత జాతీయ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. ఎచ్చెర్లకు చెందిన జర్రి కనకదుర్గ రోడ్డు దాటుతుండగా చిలకపాలెం వైపు వెళుతున్న బైక్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు బాధితురాలిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మోడల్' ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధాన్యాధివాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ బలగలోని బుచ్చిపేటలో సీతారామాలయ పునర్నిర్మాణ స్థిత యంత్ర ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం దేవతా విగ్రహాలకు ధాన్యాధివాస పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి ఉమామహేశ్వరశర్మ, రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, హోమాలు, పంచశయ్యాధివాస పూజలు జరిగాయి.

దత్తాత్రేయుడికి దశవిధ హారతులు



స్వామివారికి హారతులు

శ్రీకాకుళం కల్చరల్ బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురువారం దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు, దశవిధ హారతులు ఇచ్చారు.

ఐటీఐలో స్వచ్ఛ క్యాంపస్



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో గురువారం స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కాలేజీ ఆవరణలోని చెత్తాచెదారాలు, ఆకులను సేకరించి తగలబెట్టారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, అధ్యాపకులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులు, సైన్స్ టీచర్లను అభినందిస్తున్న హెచ్ఎం దయానంద్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ కొయ్యాం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో స్కూల్ అసిస్టెంట్ (బీఎస్) బి.లక్ష్మీనారాయణ గైడ్‌గా వ్యవహరించగా బి.దిలీప్‌కుమార్ (9వ తరగతి), ఎం.కార్తికేయన్ (8వ తరగతి), ఎల్.అరవింద్ (7వ తరగతి) బృందం మొదటి స్థానంలో నిలిచింది. వీరిని గురువారం పాఠశాలలో హెచ్ఎం జి.దయానందకుమార్ అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు బి.లక్ష్మీనారాయణ, ఎల్.జగ్గారావు, ఎం.సుధారాణి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మోడల్ స్కూల్ అధ్యాపక సిబ్బంది

జి.సిగడాం: ఒలింపియడ్ పరీక్షల్లో జి.సిగడాం ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్/కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. గణిత, సైన్స్ విభాగంలో 30 మంది హాజరుకాగా, 12 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, 8 రజత పతకాలను కైవసం చేసుకున్నారు. వీరిని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లంక, అధ్యాపకులు మజ్జి ఈశ్వర్‌నాయుడు, కోట తిరుపతిరావు, డి.ప్రమీల, పిచ్చిక నేతాజీ, కె.అరుణ కుమారి, తూముల జగదేశ్వరావు, ఎం.జ్యోత్స్న, మరడ నాగమణి, డీహెచ్ఎస్ సుబ్రహ్మణ్యం, పి.గోవిందరావు, వి.గణేష్, జామి ఉషారాణి, హైమావతి అభినందించారు.

పరీక్ష కిట్లు వితరణ

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం శ్రీకాకుళం నగరానికి చెందిన వెల్కమ్ సేవా ఫౌండేషన్ ప్రతినిధులు అట్టలు, పెన్నులతో కూడిన పరీక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.